క్లుప్తంగా

జైనులకు రిజర్వేషన్లు అమలు చేయాలని వినతి

జైన్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెడికల్ సీట్లలో జైనులకు మైనార్టీస్ కోటాలో ఉన్న రిజర్వేషన్లను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ జైన్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి సూచించారు. ఈ మేరకు ఏపీ మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్‌ను కలసి వినతి పత్రం అందించినట్లు పేర్కొన్నారు. మెడికల్ సీట్లు దరఖాస్తు క్రమంలో ఆన్‌లైన్‌లో మైనారిటీస్ విభాగంలో జైన్ ఆప్షన్ కనబడటం లేదని తెలిపారు. దీనివలన జైనులు సీటు విషయంలో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని ఆయా ఉన్నత వర్గాలకు వివరించి జైనులకు నష్టం జరగకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. అలాగే ఇతర పెద్దలను కూడా కలిసి దీనిపై వివరిస్తానని పేర్కొన్నారు. జైనులు ఇప్పుడిప్పుడే విద్యాపరంగా ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని, వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంటగా ఉంటుందన్నారు.

చంద్రబాబు, లోకేష్‌లతో శాంతిభద్రతలకు విఘాతం

వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల శ్రీనివాస్‌కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): చంద్రబాబు, లోకేష్‌లు తమ పర్యటనల్లో నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టడమే ధ్యేయంగా ఉపన్యాసాలిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశాల్లో చదువుకున్నానని గొప్పలు చెప్పుకునే నారా లోకేష్ తన పాదయాత్రలో జనం మధ్య మాట్లాడే భాష వినడానికే అసహ్యంగా ఉందని మండిపడ్డారు. ఇటువంటి వాడు మూడు శాఖలకు మంత్రిగా ఎలా పని చేశాడని యువత సిగ్గుపడుతుందని తెలిపారు. యువతకు ఆదర్శంగా ఉండాల్సిన లోకేష్ వ్యాఖ్యలు వారిని తప్పుదారి పట్టించేలా ఉన్నాయన్నారు. ప్రజల్లో స్పందన రాకపోవడంతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి వారిని ప్రభావితులను చేయాలనుకోవడం సరి కాదని హితవు పలికారు. రాజకీయాల్లో నలభై ఏళ్ల సీనియర్‌నని చెప్పుకునే చంద్రబాబు సైతం జిల్లాల పర్యటనల్లో కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడే విధంగా ప్రసంగాలు చేస్తున్నాడని గుర్తు చేశారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న ఈ ఇద్దరిని నియంత్రించాలని, లేదంటే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు త్వరలో రాష్ట్ర గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందచేస్తామని తెలిపారు.







మహాలక్ష్మీ నమోస్తుతే..

పవిత్ర శ్రావణ శుక్రవారం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహాలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో దేవాలయం కిటకిటలాడింది. క్యూలైన్లు భక్తులతో బారులు తీరి కనిపించాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ



కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి కార్పొరేటర్ నరేంద్ర రాఘవ

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ సర్కిల్–1 పరిధిలోగల 39వ డివిజన్‌లోని 117వ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించటంలో భాగంగా నగరంలో మొత్తం 19 కుట్టు మిషన్ ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అందులో ఇది తొలి కేంద్రమని తెలిపారు. పొదుపు సంఘాలకు సున్నా వడ్డీకి రుణాలు, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా దేశంలో మరెక్కడా లేని విధంగా అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. మహిళా సాధికారత, స్వావలంబన కోసం ప్రభుత్వం కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి వారికి ఆర్థిక ప్రయోజనాలను చేకూరుస్తుందన్నారు. అదే విధంగా మహిళలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపారాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ మాట్లాడుతూ ఇప్పటికే మహిళల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని తొలిగా తమ డివిజన్‌లో ప్రారంభించటంతో డివిజన్‌లోని పలువురు మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ యూసీడీ విభాగం ప్రాజక్ట్ ఆఫీజర్ శకుంతల, వీఎమ్‌సీ సర్కిల్–1 ఇన్‌చార్జ్ సీడీఓ, టెక్నికల్ నిపుణుడు డాక్టర్ ఫణి కుమార్, టీఈ రమ్యకృష్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ రమ్య, స్థానిక మహిళలు బొండా ఉమాతులసి, ఇజ్జాడ నాగమణి, ఆర్పీలు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీపీ మండల్ చిరస్మరణీయుడు



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శేషగిరిరావు తదితరులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): బీసీలకు రిజర్వేషన్లు కల్పించటంలో విశేష కృషి చేసిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) చిరస్మరణీయుడని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు అన్నారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాధరపురంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల సర్వీస్‌లో 27 శాతం రిజర్వేషన్ కల్పించిన మహానుబావుడు బీపీ మండల్ అన్నారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీల కోసం 11 రకాల జీవన ప్రమాణాలను కొలమానంగా తీసుకుని సుమారు మూడు వేలకుపైగా కులాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను అందించిన వ్యక్తి బీపీ మండల్ అన్నారు. దానిని అమలు చేసేందుకు ఆయన చేసిన ప్రయత్నాల్లో అనేక అవరోధాలు కలిగాయని పేర్కొన్నారు. చివరికి కేంద్ర, రాష్ట్ర విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు సాధించటానికి మూలకారకుడు బీపీ మండల్ అని వివరించారు. బీసీల అభ్యున్నతికి విలువైన సూచనలు చేసిన బీపీ మండల్ దేశంలోని బీసీలందరి మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మాదల తిరుపతిరావు, ఎస్వీ యశోద, అంకాని నాగరాజు, పిచ్చుక లింగారావు, టి.పూర్ణయ్య, అమృత, ఎ.పార్వతి, టి.ప్రమీల, జి.రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ అధికారిపై వ్యాఖ్యలు దుర్మార్గం

జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్



మీడియా సమావేశంలో బీసీ సంఘ ప్రతినిధులు

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర వక్ఫ్‌బోర్డు స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మైనార్టీ మహిళ ఐపీఎస్ అధికారిని షిరీన్‌బేగంపై అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న టీడీపీ ఏజెంట్ ఫారుక్ షుబ్లీ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఫోర్‌మెన్ బంగ్లా, ఎర్రకట్ట వద్ద అక్బరీ మసీదులో ప్రార్థనల అనంతరం గౌస్‌మొహిద్దీన్ విలేకర్లతో మాట్లాడారు. గత టీడీపీ హయాంలో వక్ఫ్ బోర్డును అవినీతిమయం చేసి వేలాది ఎకరాలు అన్యాక్రాంతం చేసిన టీడీపీ నాయకులు ముస్లింలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర వక్ఫ్ బోర్డును ప్రక్షాళన చేసి, షిరీన్‌బేగం వంటి సమర్థులైన అధికారులతో వక్ఫ్ ఆస్తులను ఆక్రమణదారుల చెర నుంచి విడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల నంద్యాలలో విలువైన వక్ఫ్ ఆస్తులను ఆక్రమణదారుల చెర నుంచి విడిపించి సమర్థురాలైన అధికారిగా షిరీన్ బేగం తనను తాను నిరూపించుకుని అందరి ప్రశంసలు అందుకున్నారని పేర్కొన్నారు. గురువారం కోర్టు ఉత్తర్వులు అందే సమయానికి ఆవిడ విధుల నుంచి వెళ్లిపోయారని, దానిని వక్రీకరిస్తూ కోర్టు ధిక్కారం అంటూ షుబ్లీ డ్రామాలు ఆడుతూ అవినీతిపరుల కొమ్ముకాస్తున్నాడని ధ్వజమెత్తారు. తన స్వప్రయోజనాల కోసం అటువంటి అధికారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఫారుక్ షుబ్లీ మైనారిటీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ 55వ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ సలీం, జిల్లా కార్యవర్గసభ్యులు బడేమియా, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ యూనిస్, ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా అధికారిపై ఆరోపణలు సరికాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నిజాయతీ గల అధికారిపై అవినీతి ఆరోపణలు చేయడం సరికాదని బీసీ ఇంటర్నేషనల్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్వీ.రావు పేర్కొన్నారు. కేఎల్‌రావునగర్‌లోని బీసీ ఇంటర్నేషనల్ వెల్‌ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో ఎస్వీ.రావు మాట్లాడుతూ నిజాయితీ కలిగిన అధికారిని షీరిన్ బేగంపై కొంత మంది వ్యక్తులు కావాలని అసత్య ప్రచారాలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మైనార్టీ హక్కుల సంఘం పేరిట మైనార్టీ మహిళను ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీ మహిళైన షీరిన్ బేగంను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నామని పేర్కొన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, బాయన శేఖర్‌బాబు, బీసీ సంఘ సభ్యులు శంషాద్‌బేగం, షేక్. సాధిక, షేక్. షకీలా , పర్వీన్ తదిరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బయటకు వెళ్లిన తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ కార్మెల్ చర్చి ప్రాంతానికి చెందిన దివి వాసంతి, రాజేష్‌బాబు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజేష్‌బాబు తిరిగి రాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సామాజిక బాధ్యతగా పేదలను ఆదుకోవాలి

సెర్ప్ కార్యదర్శి ఇంతియాజ్



నిత్యావసర సరుకులు అందిస్తున్న ఇంతియాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్పొరేట్ సంస్థలు సోషల్ రెస్పాన్సిబులిటీ (సామాజిక బాధ్యత) కింద ఇబ్బందుల్లో ఉన్న పేదవారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని సెర్ప్, ఏపీ సీసీఎల్ఎ కార్యదర్శి ఏఎమ్‌డీ ఇంతియాజ్ పిలుపునిచ్చారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరద నీరు ఇళ్లల్లోకి చేరి ఇబ్బందులు పడుతున్న విజయవాడ రూరల్ మండలం రామరాజ్యనగర్ ఎగువ, దిగువ కట్టకు చెందిన నివాసితులకు ఆయన శుక్రవారం నిత్యావసర సరుకులు అందచేశారు. నెస్లే ఇండియా, జేసీఐ ఇండియా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆపన్న హస్తం అందించటంలో స్వచ్ఛంద సంస్థలతోపాటు కార్పొరేట్ సంస్థలు కూడా పాల్గొనాలని సూచించారు. నెస్లే ఇండియా కార్పొరేట్ అఫైర్స్ మేనేజర్ వసీం అహ్మద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పేదలకు సాయం అందించడంలోను, విపత్తుల సమయాల్లో వారి అవసరాలను తీర్చడంలోను సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. నెస్లే బృందం, జేసీఐ ఇండియా ఫౌండేషన్ డైరెక్టర్ ఎస్‌బీ హర్షవర్ధన్‌రెడ్డి, జేసీఐ విజయవాడ ఇంపాక్ట్ శాఖ అధ్యక్షురాలు బి.స్వాతి, డైరెక్టర్ లక్కం రవీంద్ర రెడ్డి, సభ్యులు విష్ణు రాజు, మహేష్‌బాబు, పల్లా నాగరాజు, దీప్తి, గణేష్‌బాబు, వర్షిత, శివ, సుబ్రహ్మణ్యేశ్వరరావు, పంచాయితీ సెక్రటరీ లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు




ప్రత్యేక పూల అలంకారంలో పద్మావతిదేవి



వరలక్ష్మీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



పద్మావతి అమ్మవారి సన్నిధిలో పూజలు



మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



లలితాంబికా పీఠంలో అమ్మవారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని మహిళలు అత్యంత వైభవంగా తమ గృహాల్లో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించుకున్నారు. పవిత్ర శ్రావణ శుక్రవారం అందులోనూ వరలక్ష్మీ వ్రతం కావడంతో ఆయాలన్నీ కిటకిటలాడాయి. ప్రధానంగా వన్‌టౌన్‌లోని వైష్ణవ, శైవ, శక్తి ఆలయాలన్నీ భక్తులతో రద్దీగా మారాయి. లక్ష్మీదేవి స్వరూపమైన వరలక్ష్మీదేవిని పూజిస్తే సకల శుభాలు సిద్ధిస్తాయని, సుమంగళిగా వర్ధిల్లుతారని మహిళల విశ్వాసం. అందులో భాగంగా దాదాపుగా ప్రతి ఇంట వరలక్ష్మీ వ్రతాలను జరుపుకోవడ ఆనవాయితీగా వస్తుంది.

వెంకన్న సన్నిధిలో...

వన్‌టౌన్‌లో వేంచేసి ఉన్న వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో వేంచేసి ఉన్న పద్మావతి దేవి అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకొని శుక్రవారం పలు కార్యక్రమాలను ప్రముఖ ఆగమ పండితులు నేతృత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం పద్మావతి అమ్మవారి సన్నిధిలో మహిళలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ మహాలక్ష్మీ స్వరూపమైన వరలక్ష్మీదేవిని పూజించటం ద్వారా ఆ అమ్మవారి వ్రతాన్ని ఆచరించటం ద్వారా మహిళలకు సుమంగళియోగంతో పాటుగా సిరిసంపదలను వరలక్ష్మీదేవి అనుగ్రహిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించిన తీరు భక్తులకు కనువిందు చేసింది. ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించగా ఆలయ అర్చకస్వాములు పొన్నంగపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు.

కిటకిటలాడిన ఆలయాలు

పాతశివాలయంలో....

భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు వరలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులతో అమ్మవారి సన్నిధిలో వ్రతాలను ఆచరింపజేశారు. ఇతర ఉపాలయాల్లోనూ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగరాజు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా దీపోత్సవం

శ్రీ కన్యకాపరమేశ్వరి కోదండరామ దేవస్థానం (కొత్తగుళ్లు) ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీ ఆండాళ్ అమ్మవారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా వివిధ రకాల పూలతో అమ్మవారికి అలంకరించారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు పర్యవేక్షించారు.

చదును మహాలక్ష్మీ దేవస్థానంలో.....

కొత్తపేట బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీ చదును మహాలక్ష్మీమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం పర్వదినాలను పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు.అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న అష్టలక్ష్మీలు అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో భారీగా భక్తులు తరలివచ్చారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహాలక్ష్మీ అమ్మవారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పెద్ద ఎత్తున ఉభయ దాతలు, భక్తులు దర్శించుకుని ప్రత్యేక కుంకుమార్చనలు జరిపించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ కమిటీకి చెందిన బెవర సూర్యనారాయణ, మరుపిళ్ళ హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి అమ్మవారికి విశేష పూజలు చేశారు. పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని లలితాంబికా పీఠంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష కుంకుమార్చనలు చేశారు. పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించగా, పీఠం కన్వీనర్ చైతన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

బీఎస్ఎన్ఎల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాలరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సెప్టెంబర్ 12న జరిగే బీఎస్ఎన్ఎల్ మూడవ మెంబర్‌షిప్ వెరిఫికేషన్ (జాతీయ ఎన్నికలు) లో ఆలిండియా గ్రాడ్యుమేట్ ఇంజినీర్స్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్‌ను బలపరచాలని రాష్ట్ర కార్యదర్శి డి.వేణుగోపాలరావు కోరారు. స్థానిక చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో శుక్రవారం ఎగ్జిక్యూటివ్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆలిండియా గ్రాడ్యుమేట్ ఇంజినీర్స్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని చెప్పారు. పెండింగ్ హెచ్ఆర్‌కు సంబంధించిన విషయాలను పరిష్కరిస్తామని ఉద్యోగస్తులకు హామీ ఇచ్చారు. బీఎస్ఎన్ఎల్ మనుగడను కొనసాగిస్తామని, ఈ 2, ఈ 3 పే స్కేల్స్ సమస్యలను పరిష్కరిస్తామని, ఇ–1ఎ పే స్కేల్‌లో ఉద్యోగం పొందిన ఎగ్జిక్యూటివ్ కి రూ.22,820 ప్రారంభ బేసిక్ సమస్యను, 30 శాతం సూపర్‌యాన్యుయేషన్ బెనిఫిట్‌ని కూడా పరిష్కరిస్తామని, జనవరి ఒకటి, 2017 నుంచి మూడో వేతన సవరణ కమిటీ సిఫారసులను అమలుపరిచేలా తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. అర్హులైన ఎగ్జిక్యూటివ్స్ అందరికీ పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఏఐజీఈటీవోఏ జాతీయ అధ్యక్షుడు జి. వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి రవి షీల్ వర్మ, కన్వీనర్ అండ్ చీఫ్ ప్యాట్రన్ ఆఫ్తాబ్ అహ్మద్ ఖాన్, సహాయ కార్యదర్శి ఫజల్ అహ్మద్, సంయుక్త కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, ఏపీ సర్కిల్ అధ్యక్షుడు కె.హరిబాబు, కోశాధికారి ఎంవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ టీచర్స్ కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు టీచర్స్ కాలనీ, అప్నాబజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. చిట్టినగర్ సెక్షన్ పరిధిలోగల 33/11కేవీ మిల్క్ ప్రాజెక్ట్ సబ్ స్టేషన్ పరిధిలోని సయ్యద్ అప్పలస్వామి కాలేజి వెనుక భాగంలోని కొండ ప్రాంతం, వీజీఎస్ పబ్లిషర్స్ ఏరియా, రాజీవ్ శర్మ నగర్, లంబాడీపేట, సాయిరాం సినిమా హాల్ ఏరియా, కలరా హాస్పటల్ కొండ ప్రాంతం, కుండల మార్కెట్ ఏరియా, సౌమ్య సినిమా హాల్ ప్రాంతంలో కరెంట్ నిలిపివేస్తామన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన నేమాల భవానీ, శ్రీను భార్యాభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు కాగా చిన్న కుమార్తె నరహరి స్వర్ణలత (21)కి మూడేళ్ల కిందట గుంటూరుకు చెందిన రాఘవేంద్రరాజుకు ఇచ్చి వివాహం జరిపించారు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా స్వర్ణలత పుట్టింటికి వచ్చేసింది. స్వర్ణలత నివాసం ఉండే బ్లాక్‌లో అజయ్, అతని భార్యతో పరిచయం అయింది. 24వ తేదీ సాయంత్రం 8 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన స్వర్ణలత కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ఆరా తీయగా అజయ్ కూడా కనిపించడం లేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కో ఆపరేటివ్ డెయిరీల అభివృద్ధికి సహకరించండి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాడి పరిశ్రమలోని కో ఆపరేటివ్ డెయిరీల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు కేంద్ర మంత్రి పశుపతి కుమార్ పరాస్‌ను కోరారు. విజయవాడ విచ్చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి పశుపతి కుమార్ పరాస్‌ను విజయ డెయిరీ చైర్మన్ ఆంజనేయులు, ఎండీ కొల్ల ఈశ్వరబాబు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. మంత్రికి కృష్ణా జ్ఞాపికను అందచేశారు.

భర్త అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వించిపేటకు చెందిన షేక్. ముంతాజ్, ఆసీఫ్ భార్యాభర్తలు. ఆసీఫ్‌కు మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వైద్యం చేయిస్తున్నారు. తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది.

మహిళ ఆత్మహత్యాయత్నం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యాభర్తల మధ్య విభేదాలతో వివాహిత నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. లంబాడీపేట సాయిరాం థియేటర్ ప్రాంతానికి చెందిన పార్వతి, సాయిబాబు భార్యాభర్తలు. వీరికి రెండేళ్ల కిందట వివాహం కాగా కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో 24వ తేదీన ఆత్మహత్యకు యత్నించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.